సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 15 । జూలై । 2024



ఉద్యోగుల ఆగ్రహ జ్వాలలు

కూటమి ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ విడుదల చేయడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. 8లో



పచ్చిమేత మేలు

సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని, పశువుల్లో పాల దిగుబడికి పచ్చిమేత మేలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. 8లో



మరమ్మతులకు మోక్షమెప్పుడో !

చాట్రాయి మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగుపై నిర్మించిన కాజ్‌వే శాశ్వత మరమ్మతులకు మోక్షమెప్పుడోనంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు : ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తైక్వాండో బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ



జిల్లా తైక్వాండో బెల్ట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా తైక్వాండో బెల్ట్ టెస్ట్ ఆదివారం పట్టణంలోని కొండయ్య చెరువు సమీపంలోని ద్రోణాచార్య అకాడమీలో నిర్వహించారు. జిల్లా సెక్రటరీ కె.శివనాగరాజు, రాష్ట్ర తైక్వాండో సభ్యులు సతీష్, కోచ్ ఆవాల శివకుమార్ పర్యవేక్షించారు. 15 మందికి తైక్వాండో టెస్ట్ నిర్వహించి వారికి బెల్ట్‌లు అందజేశారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడి ప్రతిభ



చంద్రశేఖర్

నూజివీడు : ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (ఏపీఆర్‌సీఈటీ)2023–24 ఫలితాల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ టీ చంద్రశేఖర్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈయన 142 మార్కులు సాధించి ఏపీఆర్‌సీఈటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించాడు. నూజివీడు ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రశేఖర్‌ను అధికారులు అభినందించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్



సోమవరప్పాడులో పర్యవేక్షణ చేస్తున్న పెదవేగి సీఐ శ్రీనివాసకుమార్, ఎస్‌ఐ కే.స్వామి

దెందులూరు: దెందులూరు మండలం సోమవరప్పాడు, శ్రీరామవరం, కొవ్వలి గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ కొనసాగుతుందని, జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల నేతృత్వంలో నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య ప్రత్యేక పర్యవేక్షణలో శాంతిభద్రతల పర్యవేక్షణ చేస్తున్నట్లు పెదవేగి సీఐ కే.శ్రీనివాసకుమార్ అన్నారు. ఆదివారం సోమవరప్పాడు, శ్రీరామవరం, కొవ్వలి గ్రామాల్లో పోలీస్ పికెటింగ్‌ను పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. సీఐ వెంట దెందులూరు ఎస్ఐ కే.స్వామి ఉన్నారు.


ఎర్రకాలువకు వరద నీరు



తాడేపల్లిగూడెం మండలం మాధవరం – కంసాలిపాలెం కాజ్‌వే వద్ద ఎర్రకాలువ ఉధృతి

తాడేపల్లిగూడెం రూరల్ : ఎర్రకాలువకు వరద నీరు చేరుతోంది. దీంతో మండలంలోని మాధవరం – కంసాలిపాలెం కాజ్‌వే వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి పైనుంచి ఆదివారం వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. ఎగువ ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, డ్రెయిన్లు పొంగి ప్రవహించి, ఆ నీరంతా ఎర్ర కాలువకు చేరుతుంది.

మహిళా సంఘాలకు భారంగా..
ఆటో డెబిట్



- శ్రీ నిధి రుణాల రికవరీకి అమలు
- రుణం వాడని సభ్యులు నష్టపోయే పరిస్థితి
- వివాదాలకు ఆజ్యం పోయనున్న ఆటో డెబిట్

ఏలూరు(మెట్రో) : మహిళా సంఘాలకు చంద్రబాబు సర్కారు షాకిచ్చింది. రుణాల రికవరీకి చంద్రబాబు ప్రభుత్వం ఆటో డెబిట్ పేరిట కొత్త విధానం అమల్లోకి తెస్తోంది. స్త్రీ నిధి రుణాలకు ఆటో డెబిట్ విధానం అమలు చేయనుంది. దీంతో మహిళా సంఘాలకు ఈ విధానం భారంగా మారనుంది. ఈ విధానం అమలులోకి వస్తే స్త్రీ నిధి రుణాల శాతం తగ్గే అవకాశముంది.

మహిళా సంఘాల పొదుపు డబ్బుతో రుణాలు రికవరీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమాయాత్తం అయ్యింది. స్త్రీనిధి రుణాలను బ్యాంకు లింకేజీతో ఎస్‌హెచ్‌సీ గ్రూపులకు స్త్రీనిధి సంస్థ అందిస్తోంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అందించే ఈ రుణాలు జిల్లా స్థాయిలో గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. రుణాలు తీసుకున్న అనంతరం ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఈఎంఐ రూపంలో తిరిగి చెల్లిస్తుంటాయి. ఈ విధానంలో ఒక నెల వాయిదా చెల్లించకపోయినా, మరుసటి నెలలో వడ్డీతో సహా చెల్లించేవారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డెబిట్ ద్వారా ఆయా లబ్ధిదారుల పొదుపు సొమ్మును ఈఎంఐ చెల్లింపునకు వినియోగిస్తారు.

పాత విధానంలో అప్పు తీసుకున్న సభ్యులపైనే భారం

సాధారణంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు స్త్రీ నిధి రుణం రూ.లక్ష వరకు మంజూరు చేస్తారు. సంఘంలో కనీసం ముగ్గురు సభ్యులు లేదా సభ్యులందరూ వారి అవసరాల మేరకు తీసుకుంటారు. సభ్యుల మధ్య అవగాహన మేరకు నగదు అవసరాలు ఉన్న వారు వారి అవసరాన్ని బట్టి నగదును వినియోగించుకుంటారు. రుణం తీసుకున్న సభ్యులు ప్రతి నెల వాయిదా సొమ్మును స్త్రీనిధికి నేరుగా, లేదా ఆ గ్రామ అకౌంటెంట్ (సీఏఫ్) ద్వారా చెల్లించేవారు. నగదు చెల్లించిన వెంటనే రసీదు పొందేవారు. రుణం తీసుకున్న వారిలో ఒక నెల, అంతకంటే ఎక్కువ నెలలు వాయిదా సకాలంలో చెల్లించకపోతే వారు తర్వాత వడ్డీతో కలిపి చెల్లించేవారు. ఈ పద్ధతి వల్ల రుణం భారం, వాయిదాలు కేవలం అప్పు తీసుకున్న సభ్యులపై మాత్రమే ఉండేది.

ఆటో డెబిట్ విధానంలో ఇలా

ఆటో డెబిట్ విధానంలో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు రుణాలు లింక్ చేస్తారు. దీని ద్వారా వాయిదా సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నుంచి చెల్లిస్తారు. నిర్ణీత తేదీన లబ్ధిదారుడు వాయిదా సొమ్ము చెల్లించకపోతే, రుణానికి జత చేసిన బ్యాంకు అకౌంట్ నుంచి వాయిదా సొమ్ము జమవుతుంది. ఈ విధానంలో సంఘంలో కొంతమంది మాత్రమే రుణం తీసుకున్నప్పటికీ, రుణం తీసుకున్న వారితో పాటు తీసుకోని వారి పొదుపు డబ్బు కూడా పోతుంది. దీంతో మొత్తం సంఘంపై భారం పడుతుంది. రుణం వాడని సభ్యులు కూడా నష్టపోయే పరిస్థితి వస్తుంది. అందరూ రుణం తీసుకుని ఉంటే ఈ సమస్య ఉండదు. కొంతమంది మాత్రమే అప్పు తీసుకొంటే మాత్రం సమస్య తప్పదు.

సభ్యుల మధ్య వివాదాలకు ఆస్కారం

రుణాలు సకాలంలో చెల్లింపు జరుగుతున్నప్పుడు, సంఘ సభ్యులందరూ రుణాలు తీసుకున్న సమయంలో ఆటో డెబిట్ విధానం వల్ల కలిగే నష్టం పెద్దగా ఉండకపోయినా.. రుణాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగినా, కొంతమంది మాత్రమే రుణం తీసుకున్నా సంఘాల సభ్యుల్లో వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆటో డెబిట్ విధానంలో రుణం తీసుకున్న వారు సకాలంలో వాయిదాలు చెల్లించకపోతే అందరి పొదుపు డబ్బును బకాయి కింద డెబిట్ చేస్తారు. దీంతో సభ్యుల మధ్య ఐక్యత దెబ్బతిని సంఘాల మనుగడకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ఆటో డెబిట్ విధానాన్ని ఎస్‌హెచ్‌సీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు.

జిల్లాలో గ్రూపుల సంఖ్య

జిల్లాలో మొత్తం ఎస్‌హెచ్‌జీ గ్రూపులు 42,458 ఉండగా, ఈ గ్రూపుల్లో 4,40,934 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది జూలై వరకు సుమారు సుమారు రూ.18 కోట్లు రుణంగా తీసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.160 కోట్లు తీసుకున్నారు.

క్షీరారామం వద్ద బ్రాహ్మణుల నిరసన



పాలకొల్లు శ్రీక్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రదర్శన చేస్తున్న బ్రాహ్మణులు

పాలకొల్లు అర్బన్: బ్రాహ్మణ సమాజాన్ని, బ్రాహ్మణ మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న పైలా దాస్‌ను కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణులు కోరారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీక్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పట్టణంలోని బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. బ్రాహ్మణులు సమాజంలోని అందరూ బాగుండాలని ఆశీర్వదించేవారే తప్ప మరొకరిని నిందించడం చేతకాదని, వారిని అవమానించడం దారుణమన్నారు. పైలా దాస్ ఇటీవల బ్రాహ్మణులను అవమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యర్రమిల్లి శ్రీరామ నరసింహరావు (వైఎన్నార్), కస్తూరి సుబ్బారావు, ఎం.నరసింహాచార్యులు, వాసుదేవాచార్యులు, తనికెళ్ల శ్రీనివాస్, మద్దూరి సూరిబాబు, ములుకుట్ల సీతారామ రవీంద్ర, చిర్రావూరి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



లక్ష్మీపురం ఆలయ కల్యాణ మండపంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి అవతారంలో జగన్నాథుడు



ప్రత్యేక పూజలు అందుకుంటున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి దారు విగ్రహాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామివారి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం జగన్నాథుడు స్వామివారి కల్యాణ మండపంలో కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పిల్లన గ్రోవి పట్టుకుని, శంఖు చక్రాలు, నెమలిపించాన్ని ధరించి, రుక్మిణీ, సత్యభామ సమేత నీలమేఘ శ్యాముడైన శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి దారు విగ్రహాలకు అర్చకులు విశేష పూజలు నిర్వహించి, హారతులిచ్చారు. ఈ సందర్భంగా తిమ్మాపురం గ్రామానికి చెందిన పలువురు మహిళలు, వృద్ధులు భక్తి ప్రపత్తులతో జరిపిన విష్ణు సహస్రనామ పారాయణం భక్తులను అలరించింది.

కరుణించమ్మా..
గుబ్బల మంగమ్మ



గుబ్బల మంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామం కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి పొంగలి, దూపదీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురవడంతో వర్షం తగ్గిన తర్వాతే భక్తులను ఆలయ కమిటీవారు అనుమతించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, టాటా మ్యాజిక్‌ల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్ర సమయంలో కూడా వర్షం కురవడంతో కొండ కాల్వలు పొంగే అవకాశం ఉన్నందున ఆలయ కమిటీ వారు భక్తులు త్వరితగతిన బయటకు పంపే ప్రయత్నం చేశారు.

క్షేత్రంలో కొనసాగిన భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు దినం కావడంతో పాటు వర్షం కురవకపోవడంతో, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగడంతో క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, కేశఖండనశాల, అన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

మెరుగైన సేవలందిస్తా



- జిల్లాకు కలెక్టర్ రావడం సంతోషంగా ఉంది
- 'సాక్షి'తో కలెక్టర్ చదలవాడ నాగరాణి

సాక్షి ఇంటర్వ్యూ

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాకు కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉందని.. ప్రజల సహకారం, అధికారుల సమష్టి కృషితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజలకు ఉపాధి, సౌకర్యాలు, నూతన ప్రాజెక్టులు, తదితర అంశాలపై ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

మహిళల రక్షణకు పెద్దపీట

మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. మహిళలకు రక్షణగా ఈ కమిటీలు పనిచేస్తాయి. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు.. ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నాం. బాల్యవివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. తల్లితండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం. జిల్లాలో బాల కార్మికులు లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాము. పని ప్రదేశాల్లో తరచూ తనిఖీలు చేయడంతో పాటు, సంబంధిత యజమానులపై చర్యలు చేపట్టాలని ఆదేశించాం.

మీ కోసంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం.. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే మీ కోసంకు వచ్చే సమస్యలకు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధం తీసుకుంటున్నాం. క్షేత్ర స్థాయిలోనే సమస్య పరిష్కారం చేసేలా అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశాం.

ప్రభుత్వ ఆస్పత్రులతో మెరుగైన సేవలు

జిల్లాలోని పీహెచ్‌సీల దగ్గర నుంచి ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల వరకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. 24 గంటలూ వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎలాంటి కేసు వచ్చినా వెంటనే జాయిన్ చేసుకుని వైద్య సేవలు అందించేలా చూస్తున్నాం.

మధ్యాహ్న భోజనం మెనూ అమలుపై శ్రద్ధ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు.. తరచూ విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేలా చూస్తున్నాం.

లక్ష్యాల మేరకు రుణాల మంజూరు

బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు నూరు శాతం రుణాల మంజూరుకు కృషి చేస్తున్నాం. కౌలు రైతులకు అందించే సీసీఆర్సీ కార్డులపై రుణాల నుంచి విద్యా రుణాలు, వ్యవసాయ రుణాలు, స్వానిధి, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పీఎంఈజీపి, విశ్వకర్మ, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో వరి సాగుకు సక్రమంగా సాగునీరు అందేలా కాలువల్లో తూడు తొలగింపు పనులకు, డ్రెయిన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశాం.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు

సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు మెరుగ్గా రాణించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధం తీసుకున్నాం. కొన్ని వసతి గృహాల్లో డ్రైనేజీ, నీటి సమస్య ఉందని గుర్తించాం. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. అన్ని సౌకర్యాలతో వసతి గృహాల నిర్వహణ ఉండేలా ఆదేశాలు జారీ చేశాం.

పర్యాటకం అభివృద్ధిపై దృష్టి

జిల్లాలో గోదావరి, సముద్ర ప్రాంతాల్లో ఇప్పటికే టూరిజం కేంద్రాలున్నాయి. వాటితో పాటు మరికొన్ని ప్రాంతాల్ని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తాం. టెంపుల్ టూరిజం, గోదావరి తీర ప్రాంతాల్లో రిసార్ట్స్, బీచ్‌ల్లో పర్యాటకులకు మరిన్ని సౌకర్యాల ఏర్పాటుపై చర్యలు చేపడతాం.

హైవేలపై ప్రత్యేక దృష్టి

ఎన్‌హెచ్ 165, ఎన్‌హెచ్ 216 ప్రాజెక్టుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భీమవరం బైపాస్ ప్రాంతంలోని ఆరు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పనుల వేగవంతం కోసం భీమవరం ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశాం. ఎన్‌హెచ్–216 కోసం మొగల్తూరు మండలం కాళీపట్నం వద్ద నేషనల్ హైవే ప్రాంతంలో సీపేజ్ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారుల ఉపాధికి ఫుడ్ ప్రాసెసింగ్ సబ్సిడీ యూనిట్‌ల కింద రొయ్యలు ఒలిచి పెద్ద ప్రాసెసింగ్ యూనిట్లను సరఫరా చేసేలా, రొయ్యల షెల్లింగ్ షెడ్ల ఏర్పాటుకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తాం.

'గూడెం' మండలంలో కేంద్ర బృందం పర్యటన



తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడిగూడెం వద్ద ఉపాధి హామీ పథకం రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగరాయుడిగూడెం, జగన్నాథపురం, కడియద్ద గ్రామంలో ఆదివారం కేంద్ర జలశక్తి అభియాన్ బృందం డైరెక్టర్ జితేంద్ర సింగ్, శాస్త్రవేత్త మౌనిక సింగ్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, చెరువులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ వర్షపు నీరు ఒడిసిపట్టడం, నీటి నిర్వహణ, మంచినీటి కుళాయిలు, నీటి నాణ్యత వంటి అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. డ్వామా పీడీ ప్రభాకరరావు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులు ఏ విధంగా జరిగాయి? సేవలు ఎలా ఉన్నాయనే విషయాలను పరిశీలించినట్లు తెలిపారు. సర్పంచ్‌లు పిల్లా రాంబాబు, ఉండ్రాజవరపు చంద్రిక, యాతం కోటీశ్వరి, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంకం శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాసవీ మాత సేవలో సినీ సంగీత దర్శకుడు కోటి



పెనుగొండ వాసవీ శాంతి థాంలో సంగీత దర్శకుడు కోటి

పెనుగొండ: పెనుగొండలోని వాసవీ మాతను సినీ సంగీత దర్శకుడు కోటి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంను సందర్శించారు. 102 అడుగులు రుషీ గోత్ర మందిరంలోని వాసవీమాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన వాసవీ మాత విగ్రహాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు



పాటి హనుమ (ఫైల్)

నరసాపురం రూరల్: పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన పాటి హనుమ, మొల్లేటి దుర్గాప్రసాద్, గుంటూరి హరిప్రసాద్, మొల్లేటి మున్నా, గుబ్బల బాబి, గుబ్బల విజయ్ అనే ఆరుగురు యువకులు ఆదివారం మధ్యాహ్నం పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగారు. కాసేపు సరదాగా గడిపారు. అయితే అలల ఉధృతికి పాటి హనుమ అనే 18 ఏళ్ల యువకుడు గల్లంతయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గల్లంతైన హనుమ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న ఎస్సై మదీనా బాషా

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో ఒక విద్యార్థిని మానసిక వేదనతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ ఎస్సై మదీనాబాషా ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. వివరాలిలా ఉన్నాయి. తంగెళ్లమూడి శివగోపాలపురానికి చెందిన కుసుమూరి అనుష్క (16) ఏలూరులోని ఒక కళాశాలలో చదువుతోంది. తండ్రి దుర్గారావు ఈ ఏడాది మార్చిలో అనారోగ్య కారణాలతో మృతి చెందారు. అప్పటి నుంచి అనుష్క తీవ్ర మానసిక వేదనతో బాధపడుతోంది. తల్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం తల్లి పనులకు వెళ్లగా ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆదేశాల మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీపీఎస్ గెజిట్‌పై ఆగ్రహజ్వాలలు

- జీపీఎస్ గెజిట్ విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన
- ఎన్నికల హామీ అమలును విస్మరించారంటూ నిరసనలు
- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల గెజిట్ కాపీలను దహనం చేసిన నాయకులు
- తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలు ఉపాధ్యాయ సంఘాల నేతల ప్రకటనలు
- ఎన్నికల్లో కూటమి హామీలు విని మోసపోయామంటూ ఆవేదన
- భవిష్యత్ కార్యాచరణ బాటలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు



జంగారెడ్డిగూడెంలో జీపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు



నూజివీడులో జీపీఎస్ కాపీలను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నిడమర్రు: పాత పెన్షన్ హామీ అమలుపై అధికారంలోకి వచ్చిన నెలరోజులకే కూటమి ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ విడుదల చేయడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుపై సరైన నిర్ణయం తీసుకుని ఉద్యోగుల పక్షపాతిగా ఉంటామంటూ ఎన్నికల ప్రచార సభల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించారంటూ ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో ఇచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) జీవో 54ను కొనసాగిస్తూ కూటమి తాజాగా రాజముద్రతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్ విధానం 20 అక్టోబర్ 2023 నుంచి అమలులోకి వస్తుందని ధ్రువీకరణ చేస్తున్నట్లు ఈ గెజిట్‌లో ఉంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇంతగా మోసం చేస్తుందని ఊహించలేదంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జీవో 54ను కొనసాగిస్తూ ఇచ్చిన గెజిట్ కాపీలను ఇప్పటికే యూటీఎఫ్ జిల్లా కేంద్రాల్లో దగ్ధం చేసి నిరసనలు తెలిపింది. అలాగే ఎస్టీయూ, ఏపీటీఎఫ్, ఆప్టా తదితర ఉపాధ్యాయ సంఘాలు సైతం ఈ గెజిట్ ప్రచురణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశాయి.

ప్రభుత్వం నుంచి స్పందన కరువు

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ వచ్చి నాలుగు రోజులు అవుతున్నా దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని యూటీఎఫ్ నాయకులు అంటున్నారు. ప్రభుత్వ అనుకూల మీడియా మాత్రం గత ప్రభుత్వం మీద నెపం నెట్టేశారంటూ ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమికి తెలియకుండా ఇదంతా జరిగిందంటే అది ఉద్యోగులను విస్మరించడమే అని వారంటున్నారు. ఏది ఏమైనా ఉద్యోగులు మరోసారి వంచనకు గురవుతున్నామంటూ ఆయా వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీతో చర్చించి ఉపాధ్యాయ సంఘాలే కాకుండా మిగిలిన శాఖలు కూడా ఉద్యమంలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ముందుకుసాగాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. ఫ్యాప్టో కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

గెజిట్ ప్రతుల దహనం

సీపీఎస్ స్థానంలో తీసుకువచ్చిన జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, జీవో 54ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ గెజిట్ కాపీలను దహనం చేసి ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

యూటీఎఫ్ నిరసన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ వద్ద జీపీఎస్ నోటిఫికేషన్‌ను యూటీఎఫ్ నాయకులు ఆదివారం దహనం చేశారు. యూటీఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్యాంబాబు మాట్లాడుతూ తక్షణమే పాత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని, సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎండీ నబీ, జంగారెడ్డిగూడెం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తడాహికో, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలి

భీమవరం: జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేస్తూ ఈనెల 16న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఏపీటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి విజయానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతో సహకరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఓపీఎస్ అమలు చేసేందుకు సంవత్సరంలోపు కమిటీ వేసి ఓపీఎస్ అమలుపై నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ హామీ ఇచ్చినా జీపీఎస్ గెజిట్ జారీ చేయడంపై ఉద్యోగులందరూ ఆందోళన చెందుతున్నారన్నారు. ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



నరసాపురంలో జీపీఎస్ గెజిట్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసాపురం రూరల్: జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ పథకం) నోటిఫికేషన్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు మార్కండేయులు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం నరసాపురం యూటీఎఫ్ భవనం ఎదుట జీపీఎస్ అమలు చేస్తూ విడుదల చేసిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ఓపీఎస్ అమలు కోసం ఏళ్ల తరబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్నారు. తమ పోరాటాల ఫలితంగా ఎన్నికల ముందు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎన్నికల తర్వాత ఆర్థిక శాఖ జీపీఎస్ అమలుకు ఉత్తర్వులు తీసుకురావడం ఖండిస్తూ వెంటనే జీఓ నెంబర్ 54ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ డివిజన్ కన్వీనర్ పి శ్యాంసన్, ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, ఎస్.విజయ్‌కుమార్, ఉప్పుగంటి రాజశ్రీ, లక్ష్మీకళ, మీనాక్షి, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తీరు దారుణం



ఏపీ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చెయ్యాలి. కనీసం సాధ్యాసాధ్యాలపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమీక్షించకుండా గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 54ను రాజముద్ర వేసి గెజిట్‌ను విడుదల చేయడం దారుణం. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయల వర్గాల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలి. లేదంటే అన్ని సంఘాలను కలుపుకుని పోరాడేలా కార్యాచరణకు రూపకల్పన చేస్తాం.

– పుప్పాల ప్రకాష్‌రావు, స్టేట్ సెక్రటరీ, ఎస్టీయూ

గెజిట్ జారీ దుర్మార్గం



ప్రభుత్వ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానం కావాలని ఆకాంక్షిస్తుంటే, పాత తేదీతో జీపీఎస్ అమలుకు గెజిట్ జారీ చేయడం దుర్మార్గం. ఉద్యోగలందరినీ జీపీఎస్ పరిధిలోకి తేవడం మోసం చెయ్యడమే. ఇది ఉద్యోగుల ఆకాంక్షకు విరుద్ధం. కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత సీపీఎస్ రద్దు, 12వ పీఆర్‌సీ అమలుపై, పెండింగ్ బకాయిలపైన సంఘాలతో చర్చిస్తారనుకుంటే గత ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలపడం ఉద్యోగులను విస్మరించడమే.

– డి.జోగినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెనుమంట్ర: పెనుమంట్ర పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణచెరువు వైఎస్సార్‌నగర్‌లోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. మైలాబత్తుల ధనలక్ష్మి భర్త కువైట్‌లో ఉండగా, కుమార్తెతో కలిసి గ్రామంలో ఉంటోంది. శివారు ప్రాంతం కావడంతో కొంతకాలంగా సమీపంలో ఉన్న తోటికోడలు ఇంట్లో నిద్రించేందుకు తల్లీకుమార్తె వెళుతున్నారు. అలాగే శనివారం రాత్రి కూడా వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని, ఇంట్లో బీరువా తెరిచి ఉందని, అందులో ఉండాల్సిన ఆరున్నర కాసుల బంగారపు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు, రూ.7వేల నగదు కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని ధనలక్ష్మి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెనుగొండ సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్సై సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

శాశ్వత మరమ్మతులకు మోక్షమెప్పుడో!



చిన్నంపేట కాజ్‌వే వద్ద సిద్ధం చేసిన ఇసుక బస్తాలు

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగుపై నిర్మించిన కాజ్‌వే శాశ్వత మరమ్మతులకు మోక్షమెప్పుడోనంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రతి సంవత్సరం వాగుకి వరద వచ్చినపుడల్లా కాజ్‌వే కొట్టుకుపోతుండటంతో గ్రావెల్ ఏర్పాటు చేసి ఇరువైపులా ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఇదే తంతు సాగుతుండటంతో చింతలపూడి మండలం శివాపురం, చిన్నంపేట గ్రామాల మధ్య వరద సమయంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నంపేట నుంచి చింతలపూడి వెళ్లడానికి ఇదే మార్గం కావడం, ఇరు గ్రామాల్లో వ్యవసాయ భూములు ఉండడం, శివాపురం నుంచి చిన్నంపేటకు విద్యార్థులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల సత్తుపల్లి డిపో నుంచి వయా శివాపురం మీదుగా విజయవాడ బస్సు సర్వీసు కూడా నడుపుతున్నారు. గత ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాజ్‌వే నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎన్నికల నిబంధనల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో శాశ్వత పనులు చేపట్టకుండా కాజ్‌వేకి ఇరువైపులా ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతుండటం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాజ్‌వే పునః నిర్మాణం చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షాల వల్ల పనులకు ఆటంకం

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గతంలో కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం వర్షాల వలన తాత్కాలిక పనులు చేపట్టాం.

– శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ

తక్షణం పనులను చేపట్టాలి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాజ్‌వే నిర్మాణానికి రూ.20 లక్షల వ్యయంతో కాగల పనులకు టెండర్లు పిలిచారు. ఇప్పటి ప్రభుత్వం స్పందించి కాజ్‌వే నిర్మాణ పనులను చేపట్టాలి.

– పరసా ధనలక్ష్మి, గ్రామ సర్పంచ్, చిన్నంపేట

పాడి పశువులకు పచ్చిమేత మేలు



పాడి - పంట



ఉంగుటూరులో ఏపుగా ఎదిగిన నేపియర్ జాతి గడ్డి

ఉంగుటూరు: పశువుల పోషణ రైతుకు పెనుభారమైన నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర పశుపోషణతోనే పశువు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలదని, ప్రధానంగా పచ్చిరొట్ట మేతల వల్ల పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. ప్రధానంగా వేసవి తరువాత వచ్చే వర్షాకాలం ప్రారంభంలో పశువు మేతకు కొరత లేకుండా చూసుకోవాలి. పచ్చి మేతలు వలన పశువుకు పోషక విలువలు అందుతాయి.

పచ్చిమేత వల్ల ప్రయోజనాలు

ఎండు మేత పశువులకు కడుపునింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చి మేత కొరత రాకుండా చేసుకోవడానికి రైతు తన సేద్యభూమిలో పదో వంతు భూమిని పచ్చగడ్డి గ్రాసాలు పెంచుకోవాలి. పచ్చి మేతల్లో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వలన ఎదకు త్వరగా రావడానికి, పాల ఉత్పత్తి అధికంగా పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పచ్చి మేతల్లో కాయ జాతి, కాయ జాతివి కానివి ఉంటాయి. కాయ జాతిలో చిరుధాన్యాలు, గడ్డి రకాలు ఉంటాయి. కాయజాతి కాని రకాల్లో పశువులకు కావాల్సిన శక్తినివ్వడానికి, కాయ జాతి రకాలు మాంసకృత్తుల వృద్ధికి పనికి వస్తాయి. మేలు జాతి గడ్డి రకాలను ఎంచుకుని రైతులు పెంచుకోవాలి. పచ్చగడ్డిలో 70 శాతం, ఎండుగడ్డిలో 30 శాతం పోషక విలువలు ఉంటాయి.

గడ్డి జాతుల్లో రకాలు

ధాన్యపు జాతి రకాలు

హైబ్రీడ్ జొన్న, మొక్కజొన్న ఉన్నాయి. హైబ్రీడ్ జొన్నలో పీసీ పూచాచారి, 23, యంపీ.చారి, ఎస్ఎస్‌జీ 53, ఎస్ఎస్‌జీ 59 – 3 రకాలు ఎంపిక చేసుకోవాలి. మెదటి దశ కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నుల దిగుబడి వస్తుంది. మూడు కోతలు, ప్రతి 40 రోజులకు ఒక కోత చొప్పున లభిస్తుంది.

- మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయ కిసాన్ రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 నుంచి 70 రోజులకు వస్తుంది. 20 నుంచి 23 టన్నుల దిగుబడి లభిస్తుంది. 3 కోతలు వరకు వస్తుంది.

కాయజాతి పచ్చిమేతలు

అలసందలో యూపీసీ 5236, ఈసీ 4216 రకం, ఐసీ 4216 రకం, రష్యన్ అలసంద రకాలు మంచివిగా ఉన్నాయి. ఈ రకం 70 రోజులకు కోతకు వస్తుంది. పచ్చిమేత 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక కోత మాత్రమే వస్తుంది.

- లూసర్న రకంలో ఆనంద్ 2, ఆర్ఎల్ 52, కామ్ 2, ఆర్ఎల్ 58 రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 రోజులకు వస్తుంది. పచ్చిమేత 20 నుంచి 25 టన్నులు ఎకరాకు దిగుబడి లభిస్తుంది. ప్రతి 30 రోజులకు ఒకసారి 8 కోతలు వరకు వస్తుంది.
- పిల్లిపెసర్లులో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది.
- జనుములో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 50 శాతం పూత దశలో కోయాలి. ఒకే కోత ఉంటుంది. 7 నుంచి 9 టన్నులు దిగుబడి లభిస్తుంది.

గడ్డి జాతుల్లో మేలు రకాలు

- నేపియర్: నేపియర్ బజ్రా21, ఏపీబీఎన్ 1, కో 1, కో 2, కో 4 వంటివి ఎంపిక చేసుకోవాలి. మెదటి కోత కణుపులు నాటిన తరువాత 60 నుంచి 75 రోజుల కాలవ్యవధిలో లేదా ప్రతి 40 రోజులకు ఒకసారి సంవత్సరానికి 5 నుంచి 6 కోతలు కోయవచ్చును. 70 నుంచి 80 టన్నుల దిగుబడి లభిస్తుంది.
- సారా గడ్డి జాతి : నాటిన 75 నుంచి 80 రోజులకు వస్తుంది. 30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది. ఎకరాకు ప్రతి 40 రోజులకోసారి కోతకు వస్తుంది. 6 కోతలు కోయవచ్చును.
- గిన్ని గడ్డి రకం: పీపీజీ 14, హమిల్, మాకుని, కలోనియన్ జాతులు మంచివి. ఈ రకాలు నాటిన 60 నుంచి 70 రోజుల వ్యవధిలో మొదటి కోతకు వస్తుంది. ఏడాదికి 7 కోతలు వస్తాయి. 30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది.

మేలుజాతి గడ్డి రకాలను పెంచాలి



రైతులు మేలుజాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతు గడ్డి సాగు చేయడం వలన పశుగ్రాసం కొరత ఉండదు. మేలుజాతి గడ్డి రకాలు తినడం వలన పశువులు అధిక పాలను ఇవ్వడం ద్వారా రైతులకు లాభాలు బాగుంటాయి.

– మల్లిపూడి బాబూరావు, లైవ్ స్టాకు అధికారి, ఉంగుటూరు

అనుమానాస్పద స్థితిలో బిహార్ కార్మికుడి మృతి



చెట్టుకు వేలాడుతున్న మాంజీది మృతదేహం

దెందులూరు: బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం ముప్పవరం ఫ్యాక్టరీలో ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం గాయ్‌ఘాట్‌కు చెందిన రాజు మాంజీది (24) ముప్పవరం పంచాయితీ పరిధిలోని నాగ హనుమాన్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఫ్యాక్టరీలోని ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై స్వామి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కై కలూరు: చౌక దుకాణాల ద్వారా విక్రయించే రేషన్ బియ్యాన్ని ఆటోలో జిల్లా సరిహద్దులు తరలిస్తున్న వ్యక్తిని కలిదిండి ఎస్సై ప్రియకుమార్ ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కై కలూరుకు చెందిన కొత్తపల్లి నాగరాజు కైకలూరు సమీప గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి 25 కేజీల బస్తాలు 20, 50 కేజీల బస్తాలు 7 వాహనంలో తరలిస్తూ ఉప్పుటేరు వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. మొత్తం 850 కేజీల బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.17 వేలు విలువ ఉంటుందని అంచనా వేశారు. నాగరాజుపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

బైక్ చోరీ

ఆగిరిపల్లి: సగ్గూరులో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తుండూరు శ్రీమన్నారాయణ ఈనెల 8వ తేదీన తన ఇంటి బయట బైక్ ఉంచాడు. మరుసటి రోజు ఉదయం బయటకు వచ్చి చూడగా, బైక్ కనిపించలేదు. దీంతో ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు ఏస్సై సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

భీమడోలు: ఆగడాలలంక వద్ద అక్రమంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. చెట్టున్నపాడు నుంచి ఆగడాలలంక వైపుగా ఓ వాహనంలో ఆగడాలలంక చేపల చెర్వులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వాహనంతో పాటు కోళ్ల వ్యర్థాలను మూటలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు మండలం గుడివాకలంకకు చెందిన భలే శబరీశ్వరరాజు, భలే సాయికుమార్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జంగారెడ్డిగూడెంలో చోరీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం అయ్యప్ప టౌన్‌షిప్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు బాసంశెట్టి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జ్యోతిబాస్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజు ఓ పత్రికలో పనిచేస్తూ జేపీ సెంటర్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అయ్యప్ప టౌన్‌షిప్‌లో 3వ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం తన బావమరిది కుమారుడి పుట్టినరోజు కార్యక్రమానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి హాజరయ్యాడు. తిరిగి రాత్రి 10.30 సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి, ఇంటి ఉత్తరం తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన నాగరాజు లోపలికి వెళ్లి చూడగా, గదిలోని బీరువాను పగులగొట్టి అందులో ఉన్న నాలుగు గ్రాముల బంగారు చెవిరింగులు, బ్యాగ్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. బ్యాగ్‌లో షాపు తాళాలు, ఇంటి తాళాలు, ఇతర ధ్రువపత్రాలు ఉన్నాయని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాట్నాలమ్మకు సారె సమర్పణ

దెందులూరు: పెదవేగి మండలం శ్రీరాట్నాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి వివిధ పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. కవ్వగుంట గ్రామస్తులు శ్రీరాట్నాలమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా సారె సమర్పించారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



గోదావరి లలితాంబ ఘాట్ వద్ద చెట్లు నరికేసిన దృశ్యం

నరసాపురం: నరసాపురంలో గోదావరి గట్టు వెంబడి చెట్లను కొన్ని రోజులుగా అజ్ఞాత వ్యక్తులు ఇష్టానుసారం నరికివేస్తున్నారు. చెట్లు ఉన్న ప్రాంతం అటు మున్సిపాలిటీ ఇటు కన్జర్వెన్సీ శాఖల పరిధిలో ఉంది. కానీ చెట్లు నరికివేతపై రెండు శాఖల అధికారులు నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గోదావరి గట్టుకు రక్షణగా ఉంటుందని, మరోవైపు నది పరీవాహకప్రాంతం ఆహ్లాదంగా ఉంటుందనే ఉద్దేశంతో 2014 పుష్కరాల సమయంలో గోదావరి బండ్ వెంబడి మొక్కలను నాటి పెంచారు. అయితే కొన్ని రోజులుగా చెట్లు నరుకుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం చెట్లు నరుకుతున్న ప్రాంతానికి కూతవేటు దూరంలోనే గత జనవరిలో గోదావరి గట్టు కోతకు గురైంది. ఓ టీడీపీ నేత చేపట్టిన అక్రమ కట్టడం కోసమే ఇలా చెట్లు నరుకుతున్నారని, అందుకోసమే అధికారులు మౌనం పాటిస్తున్నారని సమాచారం.

క్లుప్తంగా

అలరించిన సంగీత కచేరి


సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని డీఎస్ చెరువు సమీపంలోని సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరి ప్రేక్షకులను అలరించింది. భగవన్నామ సంకీర్తనలు అలరించాయి. గాన సభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ పర్యవేక్షించారు. పట్టణ ప్రముఖులు, సంగీత ప్రియులు తదితరులు హాజరయ్యారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డైమండ్స్ మహిళా విభాగం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ డైమండ్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామారావుపేటలోని బృందావనంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్ కె.రోజా రమణి సహకారంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ కేవీ కమల, చిక్కాల భ్రమరాంబికా మాధురి, మద్దుల సుభద్ర, కొండేటి లక్ష్మి, ప్రియాంక, ఆశా, అమృత, సుజాత, అమల పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చొరవతో పాఠశాల అభివృద్ధి

ఉండి: పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన దేవాలయం అయిన పాఠశాల అభివృద్ధికి నడుం బిగించారు. 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర జానపద, సృజనాత్మక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, హెచ్‌ఎం సాయిరాం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మా బ్యాచ్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో 2011లో తామంతా గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆనాటి నుంచి పాఠశాల వంద సంవత్సరాల పండుగ నిర్వహించిన సమయంలోనూ, పాఠశాల గ్రౌండ్ పూడిక సమయంలోనూ సహకారమందించామన్నారు. పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్న దృష్ట్యా ఫిజిక్స్ ల్యాబ్‌లో 24 ఫ్యాన్లు అందించామన్నారు. ఈ విధంగా ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధికి 1988–89 బ్యాచ్ విద్యార్థులు సుమారుగా రూ.4 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. అనంతరం పాఠశాల గోడకు విద్యార్థులు చేపట్టిన అభివృద్ధి పనులు, తదితర వివరాలతో శిలా ఫలకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముదునూరి బంగార్రాజు, ఇందుకూరి శారద, వీరమల్లు మల్లేశ్వరరావు, కర్రి శ్రీను, కొమ్మన రాఘవ, ముంగండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు కేసు నమోదు

ఆకివీడు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగినందుకు చంపుతానని బెదిరించి, బూతులు తిట్టినట్లు స్థానిక పల్లె వీధికి చెందిన కొవ్వూరి కృష్ణవేణి ఫిర్యాదు చేసిందని, ఎస్సై బి.నాగబాబు ఆదివారం తెలిపారు. తనకు రావలసిన డబ్బులు అడిగినందుకు ఈ నెల 9న స్థానిక పెదపల్లి వీధికి చెందిన చుక్క లక్ష్మి, వెంకటేశ్వరరావు, అమ్మిలేశ్వరి, దుర్గారావు, నరగాని సుష్మాలు తన ఇంటి వద్దకు వచ్చి బూతులు తిడుతూ చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయిన్‌లో గుర్రపు డెక్క మందు పిచికారీ

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రులో గునుపూడి సౌత్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను డ్రోన్ సహాయంతో క్రిమి సంహారక మందులను పిచికారి చేసే పనులను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. ఈ డ్రెయిన్ వేలాది ఎకరాల మురుగు, వరద నీటిని ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుపుతుంది. అయితే ఈ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే అంజిబాబు పిచికారీ పనులను ప్రారంభించారు. దిరుసుమర్రులో వర్మ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ఆదివారం ప్రారంభించారు.

యలమంచిలిలో వైద్య శిబిరం

యలమంచిలి: స్థానిక పుంతల ముసలమ్మ కాపు కల్యాణ మండపంలో ఆదివారం పాలకొల్లు పట్టణ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎండీ డాక్టర్ కార్తీక్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నారిన హర్ష, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ దుర్గాప్రసాద్‌లు సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు సర్పంచ్ బర్రే మేరీ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మీ శ్రీనివాస్ గ్రామ పెద్దలు కొడవటి ఫణి, చివటపు నాగేశ్వరరావు సహకారం అందించారు.

ఎన్నికల హామీలకు తూట్లు

- సూపర్ సిక్స్ పథకాల అమలుకు మెలిక
- తల్లికి వందనంపై జీవో జారీ
- ఒక విద్యార్థికే ఇస్తామంటూ ప్రకటన
- ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం తూట్లు


పెంటపాడు ఎస్వీబీఎన్ హిందూ హైస్కూలు

పెంటపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. దానిలో తల్లికి వందనం ఒకటి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలుచేసిన అమ్మఒడి పథకానికి పేరుమార్చి తల్లికి వందనం పేరుపెట్టారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఏడాదికి రూ. 15 వేలు చొప్పున అందజేస్తామని పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన తరువాత కూటమి ప్రభుత్వం మాట మార్చింది. తల్లికి వందనం పథకానికి సంబంధించి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవో– 29 జారీ చేసింది. దానిలో ఈ పథకంలో భాగంగా ఒక్కోతల్లికి రూ.15 చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం ఒకరికే అని జీవో జారీ విడుదల చేయడంపై విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారు.

తల్లిదండ్రుల ఆందోళన

ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులు పథకం పేరుతో ఒక్కొక్కరికీ రూ. 15 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాలో జమ చేయాలి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, వారి అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఊకదంపుడు ప్రచారాలతో హోరెత్తించారు. ఆ హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు.

హామీలు అమలు చేయాలి

చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలున్నా, ముగ్గురు పిల్లలున్నా పథకాన్ని వర్తింప చేయాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. గత జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి ఎంతో పగ డ్బందీగా అమలుచేసిందన్నారు. గతేడాది జూన్ 28న తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలలు తెరిచి నెలకావస్తున్నా విద్యార్థుల పథకాలపై నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు అంటున్నారు.

హామీలను తప్పక అమలు చేయాలి



ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా వారందరికీ తల్లికి వందనం పథకంలో రూ. 15 వేలు చొప్పున అందజేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారం చేశారు. స్థానిక నాయకులు ఇదే విధంగా ప్రచారం చేశా. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పక కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం, వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. జగనన్న ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలు కూడా నూరుశాతం నెరవేర్చారు. చంద్రబాబు కూడా ఎటువంటి మెలిక పెట్టకుండా పథకాలు అమలు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలి. విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని కూటమి నాయకులు గుర్తుంచుకోవాలి.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు

పేద విద్యార్థినికి సైకిల్ అందజేత

భీమవరం : శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిభావంతురాలైన పేద విద్యార్థినికి దాతల సహకారంతో ఉచితంగా సైకిల్‌ను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. పట్టణంలోని పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని దుక్క సత్యశ్రీకి దాత ఐఎంఏ గొట్టుముక్కల బాలకృష్ణంరాజు సతీమణి వినితా కుమారి ఆర్థిక సహకారంతో సైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, పాత్తూరి బాపిరాజు, పీఎస్ఎం హైస్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో సోమవారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ ఆదివారం తెలిపారు. గొల్లవాని తిప్ప, ఎల్‌వీఎన్ పురం, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రైవేటీకరణ, ఉద్యోగ వ్యతిరేక చర్యలపై పోరాటం


స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకుడు జీజీకే మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్యాంక్ యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలో ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు, ప్రైవేటీకరణ ప్రయత్నాలపై బ్యాంకు యూనియన్లు పోరాడతామని నాయకులు ప్రకటించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ 64వ ఆవిర్భావ సభ ఆదివారం పట్టణంలోని షిర్డిసాయి కల్యాణ మండపంలో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శీలా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు దూసనపూడి సోమసుందర్, ఎస్‌బీఐ అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జవహర్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు జి.బాపయ్య శర్మ, ప్రధాన కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడారు. తొలుత స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకులు జీజీకే మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్యాంక్ ఎంప్లాయీస్ పాల్గొన్నారు.

వరద నీటి ప్రవాహం తగ్గుముఖం


జట్లపాలెం డ్యాం పై నుంచి మిడ్‌లెవెల్ కాలువ ప్రవాహం


ముదునూరు ఆయకట్టులో ఊపందుకున్న వరి నాట్లు

ముమ్మరంగా వరి నాట్లు

పెంటపాడు: తుఫాన్ ప్రభావం వల్ల వర్షం నిలకడగా కురుస్తోంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం వల్ల వరద నీరు కాలువల్లో ఉధృతిగా ప్రవహిస్తోంది. రైతులు నాట్లు వేసుకునేందుకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నారు. పెంటపాడు మండలంలోని మిడ్‌లెవెల్, లో లెవెల్ కాలువల్లో వరద నీరు ఉధృతిగా ప్రవహిస్తోంది. దుక్కిలు పూర్తయిన దృష్ట్యా నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఆదివారం తెరిపి ఇవ్వడంతో వరినాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండల వ్యవసాయాధికారి పార్థసారధి యానాలపల్లి, ఉమామహేశ్వరం, కె. పెంటపాడు, విప్పర్రు తదితర గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది ద్వారా నాట్ల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ వర్షం వల్ల ప్రస్తుతం రైతులకు నష్టం లేదన్నారు. కాలువల ప్రవాహం క్రమేపీ తగ్గుముఖం పడుతోందన్నారు. కాలువలు, డ్రెయిన్లలో పూడుకుపోయిన తూడు వల్ల వరదనీరు కిందికి లాగేందుకు సమయం పడుతోందన్నారు. ఈ విషయంపై రైతులు పరస్పరం సహకరించుకొని తూడు తొలగింపు పనులు సమష్టిగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో తీయాలి

ఆకివీడు: విద్యుత్ బిల్లులు తీయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, సకాలంలో తీయాలని వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల విద్యుత్ బిల్లులు ఆలస్యంగా తీస్తున్నారని, వినియోగదారులు తనకు ఫిర్యాదు చేశారని ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ నెలా 30 రోజులకు ముందు బిల్లులు తీయాల్సిఉందని, అయితే నెల పూర్తయిన తరువా త రెండు మూడు రోజులు జాప్యం చేసి, బిల్లులు తీస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో వినియోగదారుల శ్లాబ్ రేటు పెరిగిపోయి అదనపు ఛార్జీలు పడుతున్నాయని వాపోతున్నారన్నారు. ఇప్పటికే రక రకాల వడ్డింపులతో బిల్లులు పెరిగిపోయి ఆర్థిక భారంతో వినియోగదారుడు కృంగిపోతుంటే, మీటర్ రీడింగ్ తీసే వారి నిర్లక్ష్యంతో వినియోగదారులపై మరింత భారం పడుతుందన్నారు. దీని వల్ల బిల్లులు రూ.4 వేల నుంచి రూ.6 వేల పైబడి వస్తున్నాయన్నారు. విద్యుత్ బిల్లులు తీసే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన వినియోగదారులు తీవ్ర ఆర్థిక భారానికి గురవుతున్నారని ఆయన వాపోయారు. విద్యుత్‌శాఖ మండల, డివిజన్, జిల్లా అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో విద్యుత్ మీటర్ల రీడింగ్ కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి, నిర్లక్ష్య ధోరణిలను అరికట్టాలని, లేకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. దీనిపై విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్‌ను వివరణ కోరగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

భీమవరం : మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ సీహెచ్ భానుమణి, ఎం.శ్యామల అన్నారు. వెనుకబడిన బాలికల వసతి గృహంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలను నాటడం కాదు వాటిని సంరక్షించాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటువంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని, వసతి గృహంలో వివిధ రకాల 36 మొక్కలను నాటమన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ఎస్కే చాన్ భాషా, కొండ్రు శ్రీనివాస్‌లు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

ఖాళీ కొబ్బరి బొండాలు.. దోమలకు ఆవాసాలు


తాగి పారేసిన కొబ్బరి బొండాలు

ఆకివీడు: కొబ్బరి బొండం నీళ్లు ఆరోగ్యానికి ఎంత ఉపయోగమో, తాగి పారేసిన ఖాళీ కొబ్బరి బొండాలు అంతే ప్రమాదం. ఈ ఖాళీ కొబ్బరి బొండాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఆరోగ్యానికి కొబ్బరి నీళ్లు తాగుతున్నాం. ఖాళీ కొబ్బరి బొండం అనారోగ్యాన్ని, ప్రాణాంతకమైన వ్యాధులను తీసుకొస్తుంది. తాగి పారేసిన కొబ్బరి బొండాల్లో నిల్వ ఉన్న నీటిలో డెంగీ, మలేరియా, డయేరియా, ఫైలేరియా, టైఫాయిడ్ వంటి దోమలు పుట్టుకొచ్చి, ఆయ వ్యాధులకు కారణమవుతున్నాయి. దోమ కాటు వేసిన గంటల వ్యవధిలోనే వైరస్ విజృంభించి జ్వరం, ఒళ్లు నొప్పులతో ప్రారంభమై సీజనల్ వ్యాధులకు గురి చేస్తున్నాయి. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందకపోతే తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న కేసులు అనేకం ఉన్నాయి. తాగి పారేసిన కొబ్బరి బొండాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వీటిని ముక్కలు చేసి, నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఖాళీ కొబ్బరి బొండం డొక్కలను జనావాసాలకు దూరంగా ఉంచాలి. నిర్లక్ష్యం వహిస్తే ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వ్యాధులకు గురి కాక తప్పదని వైద్యులు, ఆరగ్యో శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. ఇదే విధంగా పాడైపోయిన టైర్లు, పాత్రలు, గోళాలు, కుండలు, గుంతల్లో ఈ దోమలు పుట్టుకొస్తున్నాయని, వాటిని తక్షణం తొలగించాలని మాసోత్సవాల ద్వారా ఆరగ్యో శాఖ సిబ్బంది విస్తృత ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

అందలమెక్కిన అరటి పండు

ఆకివీడు: అరటి పండ్ల ధర భారీగా పెరిగింది. సాధారణంగా పండుగ సీజన్లలోనూ, పెళ్లిళ్ల సీజన్‌లో వీటి ధర తారాస్థాయికి చేరుతుంటుంది. అయితే సాధారణ రోజుల్లో అరటి పండ్లు కొనేవారు తక్కువగా ఉంటారు. దీంతో అరటి పండ్లు తక్కువ ధరకు అమ్ముకుంటుంటారు. అరటి పండ్ల దిగుబడి పడిపోవడంతో పండ్ల ధరలు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో డజను అరటి పండ్లు రూ.100 పలుకుతుంది. ప్రకృతి వైపరీత్యాలకు అరటి తోటలు ధ్వంసం కావడంతో దిగుబడి తగ్గిపోయిందంటున్నారు. మహానంది ప్రాంతం నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం, కొవ్వూరు, తదితర ప్రాంతాల నుంచి అరటి పండ్లు కొనుగోలు చేసి స్థానిక మార్కెట్లలో అమ్ముతున్నారు. ఇటీవల అరటి పండ్లలో నాణ్యత లోపించడం కూడా ధరలు పెరగడానికి కారణమంటున్నారు. తయారైన అరటి పండు పగిలిపోతుంది. ఈ విధంగా గెలలోని అత్యధిక హస్తాలలో పగిలిన పండ్లు ఉంటున్నాయి. దీనివల్ల వ్యాపారులకు నష్టం వాటిల్లడంతో, అరటి పండ్లు విడిగా విక్రయించే సమయంలో అధిక ధరలకు అమ్ముకోవలసి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు


వర్షాలకు గోతులు పడి ప్రమాదకరంగా మారిన తణుకు ఎన్‌జీవో కాలనీ రోడ్డు


ముంపునకు గురైన తేతలి రాజేశ్వరి కాలనీలో రోడ్డులను మెరక చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో జన జీవనం స్తంభించిపోయింది. నాలుగు రోజులుగా రోజూ తెల్లవారు జాము నుంచే వర్షం కురవడం, మధ్యాహ్నం విరామం ఇవ్వడంతో ఉదయం ఇంటికే పరిమితమై మధ్యాహ్నం బయటకు వస్తున్నారు. అయితే ఈవర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లు ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా పలు బీటీ రోడ్లు గోతులు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తణుకులోని జాతీయ రహదారి నుంచి ఎన్‌జీవో కాలనీ, ఇందిరమ్మ కాలనీ, అజ్జరం కాలనీలకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు తణుకు జాతీయ రహదారి వద్ద నుంచి పలు చోట్ల గోతులు పడటంతో వర్షాలకు చెరువుల్లా మారిపోయాయి. దీంతో కాలనీ వాసులు పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారి గోతులు పడటంతో గోతుల్లో మోటారు సైకిళ్లు జారి పడటంతో ప్రమాదాల జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో నిత్యం పాఠశాల వాహనాలు, ఇతర వాహనాలతో పాటు నిత్యం వివిధ అవసరాల కోసం కాలనీ దాటి బయటి వచ్చే మహిళలు గోతుల కారణంగా గాయాల పాలవుతున్నారని పేర్కొంటున్నారు.

వర్షంతో ఇబ్బందులు

వర్షాల కారణంగా తేతలి గ్రామంలో రాజేశ్వరి కాలనీ, జగనన్న కాలనీలలో వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీనితో పాటు వివిధ గ్రామాల్లోని కాలనీలలో వర్షపు నీరు నిలిచి కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారింది. తేతలి గ్రామంలోని రాజేశ్వరి కాలనీలో వీధి రోడ్లను మెరక చేసే పనులను పంచాయితీ సిబ్బంది చేపట్టారు. సర్పంచ్ ఆధ్వర్యంలో కాలనీలోని మురుగునీరు బయటకు పంపించే ఏర్పాట్లు చేసి వీధులను మెరక చేసే పనులు చేపట్టారు.

సంచార వైద్యశాల ద్వారా సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం వేల్పూరు, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. ఇండియా నెట్ వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీరావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీ సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శిక్షకులు అడుసుమిల్లి వాణిశ్రీ వెంకటరత్నం (విజయవాడ) దంపతులు పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ధ్యానంతోనే జ్ఞానం–జ్ఞానంతోనే ముక్తి అన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుడు ప్రబోధించిన పంచశీలాలు వివరించారు. కార్యక్రమంలో మేడిశెట్టి కృష్ణారావు, తీడ నాగరాజు. ఎస్.ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో పేదల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న కాలనీలో రోడ్లు, మంచినీరు, వైద్య సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షాలకు కాలనీ నీట మునుగుతుందని, డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీటి వలన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఆ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని, మండల అధికారులు తక్షణం కాలనీని సందర్శించి ప్రజా సమస్యల్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయ కుమారి, డోకల రవితేజ పాల్గొన్నారు.